క్లుప్తంగా

పాల్ట్రీ పనుల అడ్డగింత

చౌడేపల్లె: మండలంలోని కాగతి సమీపంలోని పలగార్లపల్లె వద్ద ఓ ప్రైవేట్ కంపెనీ ఏర్పాటు చేస్తున్న పౌల్ట్రీ నిర్మాణ పనులను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. గ్రామానికి సమీపంలో నిర్మాణ పనులు చేపడితే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆరోపించారు. అధికారులు అక్కడికి చేరుకొని నిర్మాణ పనులు చేపట్టరాదని చెప్పడంతో పనులు ఆపివేయడంతో సమస్య సద్దుమణిగింది.

రాయల పాలన అజరామరం



నివాళులర్పిస్తున్న నేతలు

సదుం: శ్రీకృష్ణదేవరాయల పాలన అజరామరమని బలిజ సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో బలిజవీధిలో వారి ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. రాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న కాంతమ్మ

బైరెడ్డిపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. గొల్లచీమనపల్లెలో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాల ప్రభావంతో జ్వరాలు విజృంభించే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

డిగ్రీ ఫలితాల్లో ఎంవీఆర్ ప్రభంజనం



ప్రతిభ చూపిన విద్యార్థులు

పలమనేరు: ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో సాయినగర్‌కు చెందిన ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్టు కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి మంగళవారం తెలిపారు. బీబీఏ గ్రూపులో హారిక 9.52, మధురవాణి 9.20, హర్షిత 9.17, అజయ్‌కుమార్ 9.01 బీకాంలో రోహిణి 9.34, రాజేష్ 9.01, ముష్కాన్‌ఖాను 9, బీఎస్సీలో పావని 9.20, అర్చన 9.10, హాసిని 9.06 పాయింట్లలో మార్కులు సాధించారని తెలిపారు. అదేవిధంగా కళాశాలలో మొత్తం 97శాతం పాసైనట్టు పేర్కొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



నేతలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

సదుం: పోలీసులు నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసును త్వరితగతిన విచారించి బాధితులకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 12న మద్దేవాండ్లపల్లెకు చెందిన సురేంద్ర అనే దళితునిపై గంగాదేవి మరో ఇద్దరితో కలసి దాడి చేశారు. ఈకేసును విచారించి నిందితులను అరెస్టు చేసి, దాడి చేసిన వారిని శిక్షించాలని పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలిపారు. వర్షాల కారణంగా ఆలస్యమైందని, చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ షేక్‌షావలి వారికి హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. దళిత సంఘం నాయకుడు ధరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మినిస్టీరియల్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించరూ!



సీఈఓతో మాట్లాడుతున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని ఉద్యోగులు కోరారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం సీఈఓ రవికుమార్‌నాయుడిని మినిస్టీరియల్ ఉద్యోగులు కలసి తమ సమస్యను విన్నవించారు. కొన్ని సంవత్సరాలుగా అటెండర్, జూనియర్, సీనియర్ సహాయకులు పదోన్నతి లేకుండా పనిచేస్తున్నారని చెప్పారు. దీనిపై కొందరు పలు కారణాలతో కోర్టును ఆశ్రయించారని చెప్పారు. వారు పెట్టిన కేసును ప్రస్తుతం వెనక్కి తీసుకుంటునట్లు వివరించారు. ఖాళీలు ఉన్నందున తమకు పదోన్నతి కల్పించి, వాటిని భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తామని సీఈఓ హామీ ఇచ్చారు.

రండి బాబు రండి

తాగండి.. తూలండి



- మందుబాబులకు ఫ్రీగా నీళ్ల ప్యాకెట్, గ్లాస్
- సైడ్ డిష్‌గా బొరుగులు, మిక్చర్ పంపిణీ
- ప్రభుత్వ షాపులనే ఆక్రమించుకున్న కూటమి సిండికేట్
- పల్లెల్లో ఒక్కో బెల్టు షాపునకు 20 బెల్టుషాపులు కేటాయింపు
- కూటమి కార్యకర్తలకు ఎమ్మెల్యే సిఫారసులు
- ఛీదరించుకుంటున్న జనం

పలమనేరు: రండి బాబు రండి బాగా తాగండంటూ కూటమి సిండికేట్ మద్యం షాపులు మందుబాబుకు బంపర్ ఆఫర్‌నిచ్చాయి. ఇప్పటికే జిల్లాలో మొదలైన ప్రైవేటు మద్యం షాపుల్లో క్వార్టర్ బాటిల్‌తో పాటు ఉచితంగా నీళ్ల ప్యాకెట్, ప్లాస్టిక్ గ్లాసును ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పాటు ప్రారంభోత్సవం సందర్భంగా బొరుగులు, మిక్చర్‌ను కలిపి పొట్లాలను సైడ్ డిష్‌గా అందిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో బాగా సేల్స్ ఉన్న ప్రభుత్వ మద్యం షాపులను ప్రైవేట్ వాళ్లు బలవంతంగా లాగేసుకున్నట్టు సమాచారం. ఇందులో ఇప్పటికే ప్రభుత్వ షాపుల మద్యం ఉన్నప్పటికీ పట్టించుకోకుండా షాపులను ఏర్పాటు చేసుకున్నారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి 104 షాపులుండగా వీటిలో 89 షాపులు ఇప్పటికే వ్యాపారాలను మొదలు పెట్టారు. షాపుల వద్ద పర్మిట్ రూములకు సైతం రూ.5లక్షల బేరం కుదిర్చారు. దీంతోపాటు ఒక్కో మద్యం దుకాణం కింద 20 బెల్టు షాపులకేటాయింపునకు రంగం సిద్ధమైనట్టు తెలిసింది. వీటికి కూటమి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఆయా గ్రామాల్లో కేటాయించి అమ్మకాలకు చేపట్టనున్నారు. ఈ బెల్టుషాపులను సైతం సంబంధిత ఎమ్మెల్యే చెప్పినవారికే ఇచ్చేలా తతంగం సాగుతోంది. మరోవైపు మొబైల్ అమ్మకాల కోసం రంగం సిద్ధం చేశారు.

క్వార్టర్ కొన్నవారికి ఫ్రీ

ప్రైవేటు మద్యం షాపుల్లో క్వార్టర్ బాటిల్ కొన్నవారికి ఉచితంగా నీళ్ల ప్యాకెట్, గ్లాస్ అందిస్తున్నారు. దీంతో పాటు మందుకు సైడ్ డిష్‌గా బొరుగులు, శనగపప్పు, మిక్చర్ ప్యాకెట్లను అందిస్తున్నారు. దీన్ని గమనించిన ఇతర షాపులు సైతం నిత్యం ఇదేవిధంగా ఇస్తూ దానికితోడు కారం బొరుగులు, ఊరగాయ ప్యాకెట్‌ను ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఎలాగైనా వ్యాపారాలను పెంచుకోవాలనే తలంపుతో ఇలాంటి ఆఫర్లకు రంగం సిద్ధం చేసుకున్నారు.

ప్రభుత్వ దుకాణాలనే ఆక్రమించుకుని షాపులు తెరిచేశారు

జిల్లాలో చాలాచోట్ల ఇప్పటికే బాగా వ్యాపారం సాగే మద్యం షాపులను ప్రైవేటు మద్యం దుకాణాల సిండికేట్ తమ స్వాధీనంలోకి తెచ్చుకొని వ్యాపారాలని మొదలు పెట్టింది. ఈ షాపుల్లో ప్రభుత్వ మద్యం, కంప్యూటర్లు, ఫ్రిజ్‌లు సైతం అక్కడే ఉన్నప్పటికీ ఇక్కడ వ్యాపారాలను మొదలు పెట్టారు. వీటిని రెండు మూడు రోజుల్లో తమ స్వాధీనంలోకి తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అంతలోపు ఈ షాపుల్లో ఎలాంటి గోల్‌మాల్ జరుగుతుందోననే భయం ఎక్సైజ్ అధికారులకు పట్టుకుంది. ఈ నెపాన్ని గతంలో ప్రభుత్వ షాపుల్లో పనిచేసిన సూపర్‌వైజర్లపై నెట్టేలా అధికారులు మాట్లాడుతున్నారు.

పర్మిట్ రూమ్‌లకు రూ.5లక్షలే..!

మద్యం షాపులను తెరిచిన పచ్చ సిండికేట్ షాపును ఆనుకొని పర్మిట్ రూమ్‌ల కోసం రూ.5లక్షల దాకా ధరను నిర్ణయించినట్టు తెలిసింది. వీటిని కూడా కూటమి నాయకులకే అప్పగిస్తున్నారు. ఇప్పటికే షాపులకు డిపాజిట్‌లు చెల్లించి షాపులు రాని వారికి వీటిని కేటాయించేలా ఆయా ఎమ్మెల్యేల నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది.

ఒక్కో దుకాణానికి 20 బెల్టుషాపులు!

కూటమి సిండికేట్ దక్కించుకున్న షాపుల పరిధిలోని 20 గ్రామాలకు బెల్టుషాపులు ఇచ్చేలా రంగం సిద్ధమైంది. కూటమికి చెందిన కార్యకర్తలకు ఈ షాపులను ఇవ్వనున్నట్టు సమాచారం. ఇందుకోసం బెల్టుషాపు నిర్వాహకులు ముందుగా సరుకు కోసం రూ.10వేలను బయానాగా ఇవ్వాలట. దీంతో గ్రామాల్లోని టీకొట్లు, బజ్జీ సెంటర్లు, చిన్నపాటి దుకాణాల్లోనూ కూల్ డ్రింక్స్ దొరికినంత సులభంగా మద్యం దొరికే అవకాశం ఏర్పడింది. అయితే ఈ షాపుల కేటాయింపులు సైతం సంబంధిత ఎమ్మెల్యే సూచించిన వారికే దక్కేలా రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది.

ఛీదరించుకున్న జనం

ప్రైవేటు మద్యం షాపుల్లో మందుబాబులకు రూ.99కే మద్యం ఇస్తామన్న కూటమి మాటలు నీళ్లమాటలుగా మారాయి. ముఖ్యంగా మద్యం షాపుల వ్యవహారంలో జరిగిన అక్రమాలు, కూటమి నేతల పాట్లు చూసిన జనం ఛీదరించుకుంటున్నారు. ప్రైవేటు మద్యం షాపులు కూటమి నేతలు, కార్యకర్తలకు ఆదాయ మార్గాలుగా మార్చిన చంద్రబాబు పాలసీపై భగ్గున మండిపడుతున్నారు. ఏదేమైనా మందుబాబులను మోసం చేసి, 24 గంటలూ మద్యం సరఫరా చేస్తూ ఫుల్లుగా మద్యం తాగించి ఆదాయం పెంచుకోవాలని కూటమి చేస్తున్న పాలనపై సామాన్య జనం ఏవగించుకుంటున్నారు.

24 గంటలూ మద్యం విక్రయించే మొబైల్ పార్టీలు...

మరోవైపు రాత్రి పది తర్వాత ఎవరికైనా మద్యం కావాలంటే అందుబాటులో ఉండేలా మొబైల్ షాపులకు సైతం కూటమి సిండికేట్ తెరలేపింది. పార్టీకోసం కష్టపడిన కార్యకర్తలకు ముందుగానే మద్యాన్ని అందించి 24 గంటలూ సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైందని తెలుస్తోంది. వీరు అర్ధరాత్రిలోనూ కావాల్సిన వారికి మద్యాన్ని ఇక సరఫరా చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

రేపు విద్యుత్ అంతరాయం

శాంతిపురం: విద్యుత్ లేన్ల మరమ్మతు పనుల కారణంగా శనివారం 22 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ హిమ్మత్‌సాగర్ తెలిపారు. శాంతిపురంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో లేన్ల మరమ్మతు పనులను రేపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. దీని కారణంగా శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల పరిధిలోని 22 సబ్‌స్టేషన్ల(33/11 కేవీ)లో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అంతరాయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీనివాసుని పవిత్ర ఆరోహణం



స్వామికి పూజలు చేస్తున్న పండితులు

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లె గ్రామంలోని పద్మావతీ శ్రీనివాస ఆలయంలో శ్రీనివాస పవిత్ర ఆరోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో శ్రీనివాసుని పవిత్రోత్సవాల సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో వేద ప్రబంధ పారాయణ పవిత్ర ఆరాధనను యోగశాల కుంభ ఆరాధనాన్ని హోమాల ద్వారా నిర్వహించారు. స్వామి వారిని పట్టు వస్త్రాలతో పాటు పుష్ప అలంకరణం చేసి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఎదుట కలశాలను ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ పూజలు నిర్వహించారు.

వి.కోటకు బస్సులు నడపరూ!

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజూ ఉదయం వి.కోటకు, రాయచోటికి బస్సులు నడపాలని ప్రజలు కోరారు. గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మేనేజర్ సుధాకరయ్య నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు ఈ రెండు రూట్లలో బస్సులు నడపాలని, అలాగే పుంగనూరు డిపో బస్సును బెంగళూరు సమీపంలోని బత్రహళ్లి వద్ద స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని మేనేజర్ హామీ ఇచ్చారు.

వరి పంటపై అడవిపందుల దాడి

రొంపిచెర్ల: వరి పంటపై అడవిపందులు దాడి చేసి నష్టం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని అటవీ ప్రాంతాల్లోని గానుగచింత, చల్లెంపల్లె, జగడంవారిపల్లె, చిచ్చిలివారిపల్లె, బండకిందపల్లె, మోటుమల్లెల, బోడిపాటివారిపల్లెలో పందులు పంట నష్టం చేస్తున్నాయని రైతులు తెలిపారు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని పాత కురవపల్లెకు చెందిన జి.వెంకటరమణారెడ్డి వరి పొలంలో బుధవారం రాత్రి అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయని ఆవేదన చెందారు. నిత్యం వ్యవసాయ పంటలపై అడవి పందుల దాడితో పూర్తిగా నష్టపోతున్నామని తెలిపారు. అడవి పందుల దాడిలో దెబ్బతిన్న వరి, టమాట పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.



అడవిపందుల దాడిలో దెబ్బతిన్న వరి

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం

కాణిపాకం: పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ దేవాలయమైన శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో గురువారం సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలస్థానంలోని దేవతామూర్తులకు అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



అనంతరం సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు.

కానరాని సీతాఫలం

- కానరాని సీతాఫలం చెట్లు
- పంట లేక దిగుబడి భారీగా తగ్గింది
- గతంలో రైతులకు సీతాఫలం అదనపు ఆదాయం
- మార్కెట్‌లో కానరాని పండ్లు



సీతాఫలం చెట్టు, (ఇన్‌సెట్) సీతాఫలం చెట్టు

కల్లూరు(పులిచెర్ల): పోషకాలు కలిగి ఉండి పేదవాని ఆపిల్‌గా పేరుగాంచిన సీతాఫలం పంట ప్రస్తుతం ఎక్కడా కానరాక రానురాను కనుమరుగైపోతోంది. గతంలో ఎక్కడ చూసినా పొలాలగట్ల పైన, బీడు భూముల్లో, బంజరు భూముల్లో విస్తారంగా చెట్లు ఉండి పంట దిగుబడి అధికంగా ఉండేది. దీనితో రైతులకు ఆదాయంతో పాటు మూడు నెలలు కూలీలకు పని దొరికేది. ముఖ్యంగా ఇవి అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో పంట దిగుబడి వస్తుంది.

రైతులకు అదనపు ఆదాయం

గతంలో సీతాఫలం వలన ఇతర వ్యవసాయ పంటలతోపాటు అదనపు ఆదాయం లభించేది. మూడు నెలలపాటు కూలీలకు ఈపంట వలన పనిదొరికేది. వ్యవసాయ భూములతోపాటు అటవీ ప్రాంతాల్లో కూడా కాయలు లభ్యమవడంతో కూలీలు అక్కడి వెళ్లి పండ్లు తెచ్చి అమ్ముకునేవారు. దీనితో వారికి చేతి నిండా పని ఉండేది. ప్రస్తుతం సకాలంలో వర్షాలు లేక పోవడం, ఉన్న చెట్లను నరికి వేయడంతో ఇవి పూర్తిగా అంతరించిపోయాయి.

నిత్యం కల్లూరు మార్కెట్ కళకళలాడేది

గతంలో సీతాఫలం కాయలతో కల్లూరు మార్కెట్ కళకళలాడేది. చుట్టు పక్కల మండలాల నుంచి రైతులు ఈ మార్కెట్‌కే సీతాఫలాలను తీసుకొచ్చి అమ్మేవారు. ఇక్కడ నుంచి నెల్లూరు, విజయవాడ, చెన్నై ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం కాయలు లేక తినడానికి కూడా దొరకడం లేదు. దీనితో రైతులకు ఆదాయం కూడా లేకుండాపోయింది.

అదనపు ఆదాయం కోల్పోయాం



గతంలో సీతాఫలం పంట వలన వ్యవసాయ పంటలతో పాటు అదనపు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం కాయలు ఎక్కడా లేకపోవడంతో అదనపు ఆదాయం కోల్పోయాం. ప్రస్తుతం తినడానికి కూడా కాయ దొరకడం లేదు.

-సి.హరినాథ్, రైతు, మతుకువారిపల్లె

పంట లేకుండా పోయింది



సకాలంలో వర్షాలు లేకపోవడంతో పంట పూర్తిగా తగ్గిపోయింది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఈపంట దిగుబడి వస్తుంది. ఆసమయంలో వర్షాలు లేకపోవడంతో కాయలు రాకుండా పోతున్నాయి.

-సి.వీరయ్య, రైతు, ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

- ఎస్టీల్లో చేర్చకుంటే అమరావతిని ముట్టడిస్తాం



కొలమాసనపల్లిలో వాల్మీకి చిత్రపటం ఉంచిన రథాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

పలమనేరు: కొలమాసనపల్లిలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి కులస్తులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాన్ని అమర్చిన రథాన్ని ఆరిమాను గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. కల్లాడు నుంచి గొల్లపల్లి మీదుగా కొలమాసనపల్లిలోని వాల్మీకి ఆలయం దాకా రథాన్ని సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ర్యాలీగా తరలించారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘ నేతలు ప్రసంగించారు. ఏడాదిలోపు వాల్మీకులను ఎస్టీలుగా చేయాలని లేకుంటే అమరావతిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.బాబు, తెలుగు అధ్యాపకులు వాసు, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, ఎంపీడీఓ బాలాజి, ఏఓ భాస్కర్, ఎంఈఓ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ గురుమూర్తి, సర్పంచ్ భాస్కర్, నేతలు చలపతి, గణపతి, మణి పాల్గొన్నారు. అదేవిధంగా నడింపల్లిలో ఘనంగా నిర్వహించారు. బీసీ నేత దొరస్వామి పాల్గొన్నారు.

బాపలనత్తంలో..

బైరెడ్డిపల్లె: బాపలనత్తంలోని ఆలయంలో వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, వైస్ ఎంపీపీ రూప, సర్పంచులు వెంకటేష్, రమణారెడ్డి, సుజాత, బాలక్రిష్ణగౌడు, ఎంపీటీసీలు నాగరాజు, వినాయకం పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు..

గంగవరంలో..

గంగవరం: రెంటకుంట్లలోని ఆలయంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి, సీతారాముల విగ్రహాలకు బోయ కులస్తులు ఘనంగా పూజలు చేశారు. అలాగే పత్తికొండ గ్రామంలో మహర్షి చిత్ర పటానికి పూజలు చేసి నివాళులర్పించారు.

రామకుప్పంలో..

రామకుప్పం: రామకుప్పం, వీరనాగపురం గ్రామాల్లో వాల్మీకి మహర్షి ప్రతిమను ఊరేగించారు. పెద్ద సంఖ్యలో వాల్మీకి కులస్తులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పంరూరల్: మొట్లచేను, టి.సదుమూరు, పొన్నాంగూరు గ్రామాల్లో వాల్మీకి కులస్తులు, నేతలు ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు.

సదుంలో..

సదుం: మండల కేంద్రంలోని వాల్మీకి మహాముని ఆలయంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి అభిషేకాలు, పూజలు చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: వాల్మీకి సంఘ నేతలు డాక్టర్ శివ, అద్దాల నాగరాజ, సీఐ శ్రీనివాసులు, సుకుమార్ బాబు కలసి స్థానిక ఇందిరా సర్కిల్‌లో వాల్మీకి విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎస్సీమోర్చా నేతలు నరసింహులు, జేవీజే.నాగరాజు, రాజు పాల్గొన్నారు.



వీరనాగపురంలో..

కుప్పంలో..

కుప్పం: స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో వాల్మీకి చిత్ర పటానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పూజలు చేసి నివాళులర్పించారు. కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, టీడీపీ నేత రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



పుంగనూరులో..



పెద్దపంజాణి: వైఎస్సార్‌సీపీ నేతల నివాళి



మొట్లచేనులో నివాళి



వి.కోటలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



డిగ్రీ కళాశాలలో..



నడింపల్లిలో..



కుప్పంలో ఎమ్మెల్సీ నివాళి



బాపలనత్తంలో..

20న ద్రవిడ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

గుడుపల్లె: ద్రవిడ విశ్వవిద్యాలయం 27వ వ్యవస్థాపక దినోత్సవం ఈనెల 20న వర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ వేడుకలకు వర్సిటీలోని అన్నిశాఖల అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు

వి.కోట: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉద్యాన పంటలో తెగుళ్లు ఎక్కువయ్యే ఆవకాశం ఉందని ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న సూచించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా వాతవరణంలో అత్యధిక తేమ ఉండడం వలన టామాట వంటి పంటల్లో కాయలు పగిలిపోయే ఆవకాశం ఉందని పంటపై బోరాన్ 1 గ్రామ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా పూల తోటల్లో గాలిలో తేమ అధికంగా ఉండడం వలన బూడిద తెగులు ఆసించే ఆవకాశం ఉందని దాని నివారణకు మైక్లోబ్యూటానిల్ 1 గ్రాము లేదా మిథైల్ 1 గ్రామ్‌ను లీటర్ నీటికి కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీ పీహెచ్‌సీ పక్కన ఉన్న ఎన్‌టీఆర్ టౌన్ షిప్‌లో సీసీ రోడ్డు పనులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం భూమిపూజ చేశారు. పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్డు పనులు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ టౌన్‌షిప్ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, హౌసింగ్ ఏఈ యోగానంద్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.